




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 169 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 23 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :169 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 23 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు
# జగన్ కుట్ర
## మంత్రి నిమ్మల రామానాయుడు

**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవారి ప్రతిష్టను భంగపరిచేలా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుట్రలు పన్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంతో పాటు యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన జగన్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని రసాయనాల మిశ్రమంతో అపవిత్రం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని మంత్రి విమర్శించారు. లడ్డూ తయారీలో నెయ్యికి బదులు రసాయనాలు కలిశాయని సీబీఐ తన ఛార్జిషీట్‌లో పేర్కొన్నా, జగన్ ఏ మొహం పెట్టుకుని మాట్లాడు తున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన శ్రీవారి పటాలను శాసనమండలిలో ప్లకార్డులుగా ప్రదర్శించడం దారుణమని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని మండిపడ్డారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం..**

పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. పాలకొల్లులో రూ. 4.43 కోట్ల విలువైన పనులకు

- మిగతా 2లో

# టెక్నాలజీ పెరిగినా మీ
# 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు
## గ్రామీణ డాక్ సేవక్‌లపై సీఎం చంద్రబాబు ప్రశంసలు

- గ్రామీణ డాక్ సేవకుల సేవలు అమూల్యం అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని సమర్థతపై ప్రశంసలు
- ఏపీలోని 17,000 మంది డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వ సేవలను కూడా డాక్ సేవకుల ద్వారా అందిస్తామని హామీ
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో పోస్టల్ ఉద్యోగులదే కీలక పాత్ర అని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**టెక్నాలజీ ఎంత అభివృద్ధి సాధించినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో మానవతా స్పర్శతో సేవలు అందించే గ్రామీణ డాక్ సేవకులకు ప్రత్యామ్నాయం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నాడు గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్‌లతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, ఇతర సమాచారం కోసం ప్రతి ఒక్కరూ పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవారని, బ్యాంకులు లేని రోజుల్లో ఆర్థిక లావాదేవీలకు కూడా ఇండియా పోస్టే కీలక మాధ్యమంగా ఉండేదని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా సమరయోధుల మధ్య సమాచారాన్ని చేరవేసి పరోక్షంగా కీలక పాత్ర పోషించిన వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

**కేంద్ర మంత్రులపై ప్రశంసల వర్షం**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఉన్నత విద్యావంతుడని, రాజవంశంలో పుట్టినా అత్యంత పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. సింధియా నాయనమ్మ, గ్వాలియర్ రాజమాత విజయరాజే సింధియాతో తనకు మంచి అనుబంధం ఉందని, ఆమె ఎన్టీ రామారావుగారికి అత్యంత సన్నిహితురాలని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, సింధియా తండ్రి మాధవరావు సింధియాతో కూడా కలిసి పనిచేశానని, ఆయన నిరాడంబరత, నిజాయతీ గొప్పవని అన్నారు. సింధియా పూర్వీకుల గ్రామమైన 'సింధియా' విశాఖపట్నం గాజువాక సమీపంలో ఉండటం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న ఈ అనుబంధం గొప్పదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిని ప్రశంసిస్తూ, ఒక వైద్యుడిగా, ఐటీ నిపుణుడిగా అమెరికాలో అపారమైన సంపద సృష్టించి, ఇప్పుడు పార్లమెంటులో అత్యంత సంపన్న ఎంపీగా ప్రజాసేవకు

- మిగతా 2లో



# జగన్ హిందూ వ్యతిరేకి..
## అసెంబ్లీ చర్చకు రావాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సవాల

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నిప్పులు చెరిగా రు. జగన్ ఒక 'హిందూ వ్యతిరేకి' అని, ఆయ నకు హిందూ

- మిగతా 2లో



# ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా?

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. జగన్ పై, వైసీపీ నేతలపై బురద చల్లడమే చంద్రబాబు లక్ష్యమా అని అన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పినా కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా అని

- మిగతా 2లో

## ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్
# సస్పెన్షన్ పొడిగింపు...
## పదవీ విరమణ వరకూ వేటు!




- ఐపీఎస్ సునీల్ కుమార్‌పై కొనసాగనున్న సస్పెన్షన్
- ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ప్రధాన ఆరోపణలు
- సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వాదన

- మిగతా 2లో

# రాబోయే 24 గంటల్లో అల్పపీడనం
## ఈ జిల్లాల్లో దంచికొడుతున్న భారీ వర్షం

**పెన్ పవర్ డెస్క్:**వాతావరణ శాఖ అలర్ట్ ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడ న ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆదివారం మధ్యాహ్నం తర్వాత వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలోని అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడటంతో



- మిగతా 2లో

## మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు
# ఆశ్చర్యపోయాయి
## 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

- ఏఐ సదస్సు ద్వారా అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామన్న మోదీ
- జంతువుల చికిత్సకు, పురాతన గ్రంథాల సంరక్షణ కోసం ఏఐ వినియోగం చూసి ఆశ్చర్యపోయారన్న మోదీ
- సైబర్ నేరాల పట్ల హెచ్చరిక జారీ చేసిన నరేంద్ర మోదీ
- 10 నెలల చిన్నారి అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు ప్రశంసలు



**పెన్ పవర్ డెస్క్:**న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్' సదస్సుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమ మేధ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 131వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని అన్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్సకు వాటిని ట్రాక్ చేయడానికి

- మిగతా 2లో

# దేశంలోనే వేగవంతమైన మెట్రో...
# మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో
- నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఢిల్లీ-మీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్



**పెన్ పవర్ డెస్క్:** దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు

- మిగతా 2లో

# మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ
## అగ్రనేతలు లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి
- తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు
- వీరితో పాటు 16 మంది లొంగుబాటు

- మిగతా 2లో

**పెన్ పవర్ డెస్క్:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# కుంగుబాటుకు వ్యాయామ కళ్లెం!

కుంగుబాటు (డిప్రెషన్), వ్యాయామం ఒకదాన్ని మరోటి ప్రోత్సహిస్తుంటాయి. కుంగుబాటుతో వ్యాయామం మీద ఆసక్తి తగ్గుతుంది. తగినంత శారీరక శ్రమ లేకపోతే కుంగుబాటు మరింత తీవ్రమవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారికి వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. దీంతో, ముఖ్యంగా బరువులెత్తే వ్యాయామాలతో మందులు, చికిత్సలతో సమానమైన ఫలితాలు కనిపిస్తున్నట్టు తాజాగా తేలింది. యూనివర్సిటీ ఆఫ్ లాంకషైర్ పరిశోధకులు 70కి పైగా ప్రయోగ పరీక్షలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. మానసిక స్థితి (మూడ్) మీద శారీరక శ్రమ గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నట్టు గత పరిశోధనలు చెబుతున్న విషయాన్ని ఇది మరింత బలపరచింది. వ్యాయామం, శారీరక శ్రమలు కుంగుబాటుతో ముడిపడిన వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తాయి. జీవ గడియారాన్ని తిరిగి సరిచేసి నిద్ర బాగా పట్టేలా చేస్తాయి. నాడీ కణాల వృద్ధికి తోడ్పడే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ విడుదలనూ ప్రేరేపిస్తాయి. ఈ ఫ్యాక్టర్ మూడ్ నియంత్రణకు దోహదం చేయటం గమనార్హం. అందువల్ల కుంగుబాటు బాధితులు వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దని పరిశోధకులు సూచిస్తున్నారు. చికిత్స ప్రణాళికల్లో దీన్ని విధిగా చేర్చాలని చెబుతున్నారు. ఈ సమీక్ష కోసం పరిగణనలోకి తీసుకున్న అధ్యయనాలు కొన్ని పాఠాలనూ నేర్పుతున్నాయి.

### 1. ఒక చికిత్స సరిపోదు

కుంగుబాటు మనిషిని చాలా తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. జీవితంలో తృప్తిని ఘోరంగా దెబ్బతీస్తుంది. ఇలాంటి తీవ్ర సమస్యకు ఒక చికిత్స సరిపోదు. సైకోథెరపీ, యాంటీడిప్రెసెంట్ మందులకు వ్యాయామాన్ని జోడిస్తే మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అందుకే మందులు వేసుకుంటున్నా, వేసుకోకపోతున్నా సైకాలజిస్టును సంప్రదించటం, వ్యాయామం చేయటం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

### 2. ఎంత శ్రమకు అంత ఫలితం

వ్యాయామం చేస్తేనే సరిపోదు, ఎంత తీవ్రంగా చేస్తున్నామన్నదీ ముఖ్యమే. మామూలు వ్యాయామం కన్నా తీవ్రమైన వ్యాయామంతో ఎక్కువ ఫలితాలు కనిపిస్తున్నాయి. శరీరాన్ని 10 నుంచి 20 నిమిషాలు ఒకింత ఎక్కువ శ్రమకు గురిచేసినా చాలు. తీవ్రమైన వ్యాయామంటే మరీ కష్టమని అనుకోవాల్సిన పనిలేదు. పక్కవారితో మాట్లాడటం కష్టంగా అనిపిస్తే తీవ్రంగా చేస్తున్నట్టే లెక్క. ఇది ఆయా వ్యక్తుల శరీర సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది.

### 3. వ్యాయామం ఏదైనా

నడక, నెమ్మదిగా పరుగెత్తటం, యోగా, బరువులు ఎత్తటం.. ఇలా ఏ రకం వ్యాయామమైనా కుంగుబాటు చికిత్సకు తోడ్పడుతుంది. రెండు, మూడు వారాలుగా కుంగుబాటుతో బాధపడేవారికి డ్యాన్స్ చాలా మేలు చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ వీటిల్లో కొద్దిమందిని.. అదీ యువతులను పరిగణనలోకి తీసుకోవటం వల్ల అందరికీ వర్తింపజేయటం తగదని పరిశోధకులు భావిస్తున్నారు. బరువులెత్తటం, సైకిల్ తొక్కటం ఆడవారికి బాగా ఉపయోగపడుతుంటే.. యోగా, థాయ్ చీ మగవారికి మరింత మేలు చేస్తున్నట్టు కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. వృద్ధులకు యోగాతో, చిన్నవయసువారికి బరువులెత్తటంతో ప్రయోజనం కనిపిస్తోంది. యోగా, బరువులు ఎత్తటాన్ని మానకుండా కొనసాగిస్తున్నట్టూ బయటపడింది.

### 4. తోడుగా చేస్తే

ఐకమత్యం బలమనే సూత్రం వ్యాయామానికీ వర్తిస్తుంది. ఒంటరిగా కన్నా నలుగురితో కలిసి వ్యాయామాలు చేస్తే కుంగుబాటు లక్షణాలు మరింతగా తగ్గుతుండటం గమనార్హం. కుంగుబాటులో ఒంటరిగా ఉండిపోవటం పెద్ద లక్షణం. నలుగురితో కలిసి వ్యాయామం చేస్తే ఒంటరితనం దూరమవుతుంది. ఇతరుల కన్నా మరింత కఠినంగా చేయాలనే కోరికా కలుగుతుంది. కాబట్టి వీలుంటే జిమ్‌లో చేరి శిక్షకుల సమక్షంలో లేదా బృందంగా వ్యాయామం చేయటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

### 5. నైపుణ్యం సాధిస్తే

వ్యాయామాల్లో నైపుణ్యం సాధించటమూ దిగులు, నిరాశ ఎక్కువగా తగ్గటానికి తోడ్పడుతుంది. ఒకింత ఎక్కువ బరువు ఎత్తటం.. కాస్త ఎక్కువ దూరం, ఎక్కువసేపు పరుగెత్తటం కూడా నైపుణ్యం కిందికే వస్తాయి. కుంగుబాటు ఎప్పుడూ గొప్ప పనులు చేయలేవని మనిషిని వెనక్కి లాగుతుంటుంది. దీంతో చాలామంది అక్కడే ఆగిపోతుంటారు. వ్యాయామం దాన్ని అబద్ధమని నిరూపిస్తుంది. మారటం సాధ్యమేనని, కొత్త అలవాట్లు నేర్చుకోవచ్చని, మెరుగ్గా పనులు సాధించొచ్చని నేర్పిస్తుంది. ఇది నిజంగా ఒక శక్తిమంతమైన ఔషధమే. పరుగు, బరువులెత్తటం శరీరానికి పరీక్ష పెట్టి, పురోగతి సాధించేలా చేస్తాయి. యోగా, థాయ్ చీ వంటివి ఏకాగ్రత, జాగరూకత ద్వారా నైపుణ్యం పెంపొందిస్తాయి.

### 6. ఫలితాలు నెమ్మదిగా

వ్యాయామ ఫలితం కనిపించటానికి కొంత సమయం పడుతుంది. కౌన్సెలింగ్, యాంటీడిప్రెసెంట్ మందుల విషయంలో డాక్టర్లు ఎవరికి ఏది పడుతుందో, ఎంత మోతాదు సరిపోతుందో తెలుసుకోవటానికి సమయం పడుతుంది. మరోవైపు వ్యాయామానికి శారీరక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిమితులు అడ్డుతగులుతుంటాయి. ఎవరికేది నప్పుతుందో, ఆనందంగా చేయగలిగిన వ్యాయామాలేంటో గుర్తించటానికి కాస్త సమయం అవసరం. అప్పుడే మధ్యలో మానెయ్యకుండా ఉండటం సాధ్యమవుతుంది. క్రమం తప్పకుండా చేస్తుంటే నెమ్మదిగా ఫలితాలు కనిపించటం మొదలవుతుంది.

# జగన్ హిందూ వ్యతిరేకి..

- మొదటి పేజి తరువాయి

సంప్రదా యాల మీద గౌరవం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం అమరావతిలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. జగన్ తీరును, వైసీపీ నేతల వైఖరిని ఎండగట్టారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలిలోకి శ్రీ వెంకటేశ్వర స్వామి ఫొటోను తీసుకొచ్చే సమయంలో వైసీపీ నేతలు చెప్పులు వేసుకుని ఉండటం ఘోరమైన అపరాధమని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే పవిత్రమైన భగవంతుడిని సభలోకి తెచ్చారని, ఆ సమయంలో జరిగిన పొరపాటు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నా వైసీపీ నేతలు బుకాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు.

**తిరుమల పవిత్రతపై విమర్శలు..**

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై స్పందిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో జంతు కొవ్వుతో పాటు హానికర రసాయనాలు కలిశాయని నివేదికలే చెబుతున్నాయని మంత్రి గుర్తుచేశారు. జగన్ తన హయాంలో ఏనాడూ పవిత్ర సంప్రదాయాలను గౌరవించలేదని, శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సమయంలో తన సతీమణితో కలిసి వెళ్లకపోవడమే దానికి నిదర్శనమని విమర్శించారు. అలాగే తిరుమలలో అన్యమతస్థులు ఇచ్చే డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి జగన్ నిరాకరించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.

**అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?**

జగన్ అహంకారం చూసే భగవంతుడు గతంలో ఉన్న 151 సీట్ల నుండి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారని మంత్రి ఎద్దేవా చేశారు. టీటీడీ నిధులను దారి మళ్లించారని, భక్తి లేని వ్యక్తులకు పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా జగన్‌ను సరిదిద్దాల్సింది పోయి, ఆయన తప్పులను సమర్థించడం దారుణమన్నారు. ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్న జగన్, దమ్ముంటే అసెంబ్లీకి రావాలని మంత్రి సవాల్ విసురుతూ.. 'నువ్వు అసెంబ్లీకి రా.. అక్కడ బహిరంగ చర్చకు మేము సిద్ధం' అని పిలుపునిచ్చారు.

# ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటును మరోసారి పొడిగించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణ ముగిసే వరకు లేదా ఆయన పదవీ విరమణ చేసే తేదీ వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్ కుమార్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ అడిషనల్ డీజీగా, ఆ తర్వాత సీఐడీ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో, అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలపై గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై క్రిమినల్ కేసు (క్రైమ్ నెం. 187/2024) నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు ఏసీబీ కోర్టులో విచారణ దశలో ఉంది. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సునీల్ కుమార్‌ను తిరిగి సర్వీసులోకి తీసుకుంటే సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు సస్పెన్షన్ పొడిగింపు తప్పనిసరి అని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటితో పాటు, ప్రభుత్వ అనుమతి లేకుండా 2020 నుంచి 2024 మధ్య పలుమార్లు విదేశాలకు వెళ్లడం, అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలపై కూడా ఆయన ఏసీబీ విచారణను

ఎదుర్కొంటున్నారు. ఆల్ ఇండియా సర్వీసెస్ (డిసిప్లిన్ ఊ అప్పీల్) రూల్స్, 1969లోని రూల్ 3(3) ప్రకారం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సునీల్ కుమార్ పదవీ విరమణ తేదీ 2026 జూన్ 30 కావడంతో, అప్పటివరకు కేసుల విచారణ పూర్తికాకపోతే ఆయన సర్వీసులో చేరకుండానే రిటైర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి

- మొదటి పేజి తరువాయి

'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

**సైబర్ నేరాలపై హెచ్చరిక**

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

# టెక్నాలజీ పెరిగినా మీ 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

- మొదటి పేజి తరువాయి

ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిద్దరి వంటి సమర్థవంతమైన నాయకులు కేంద్రంలో ఉండటం దేశానికి గర్వకారణమని చంద్రబాబు అభివర్ణించారు.

**డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు.. ఏపీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టండి**

భవిష్యత్తులో గ్రామీణ డాక్ సేవకుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు నొక్కిచెప్పారు. వారి పనిభారాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని 17,000 మంది గ్రామీణ డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను అందించాలని కేంద్ర మంత్రి సింధియాను కోరారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఒక 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కాలుష్యరహిత ప్రయాణంతో పాటు, శ్రమ తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా సేవలు అందించగలరని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను కూడా గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ప్రజలకు చేరవేస్తామని, ఇందుకు అవసరమైన సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో అభివృద్ధి సూపర్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. 20 నెలల సుపరిపాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామని అన్నారు. ఒకప్పుడు స్మశానం, ఎడారి అన్న అమరావతిని దేవతల రాజధానిగా, ప్రపంచం మెచ్చే ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, లాభాల బాట పట్టించామని, ఈ నెలలోనే రూ.54 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ఈ 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో గ్రామీణ డాక్ సేవకులే వెన్నెముకగా నిలుస్తారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు.

# దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు జగన్ కుట్ర

- మొదటి పేజి తరువాయి

శంకుస్థాపన చేశారు. కొంతేరు గ్రామంలో రూ. 58 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల పట్ల కనికరం లేకుండా వ్యవహరించిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ నిష్పక్షపాతంగా పింఛన్లు అందిస్తోందని నిమ్మల పేర్కొన్నారు. రాజధాని నిర్మాణంతో రాష్ట్ర యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

## ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా?

- మొదటి పేజి తరువాయి

ప్రశ్నించారు. పోలీసులను రాజకీయ కక్షల కోసం వాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షలకు వాడుకుంటున్నారని అన్నారు. తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేశారని, 5 గంటల నుండి 12 గంటలు దాడి జరుగుతూనే ఉందన్నారు. పోలీసులే ప్రేక్షక పాత్ర పోషించారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ కనీసం పట్టించుకోలేదని, రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు, వైవిధ్యాలు ఉంటాయని చెప్పారు. పోలీసులను ఏవిధంగా ఉపయోగిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలు ఆలోచించమని కోరుతున్నానని అన్నారు.

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

## రాబోయే 24 గంటల్లో అల్పపీడనం

- మొదటి పేజి తరువాయి

లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అటు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోనూ భారీ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై చెదురుమదురు వానలు పడుతున్నట్లు సమాచారం అందుతోంది. అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే 24 గంటల్లో మరిన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (×వీణ) ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కోస్తాంధ్ర, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ అకాల వర్షాల వల్ల కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు.

# నేడు జిల్లా కలెక్టర్ మీకోసం కార్యక్రమం



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 22**

ఈనెల 23వ తేదీన సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# దేవుడితో ఆటలా.. మూల్యం చెల్లించక తప్పదు ...

## - వైకాపా నేతల పై మంత్రి డాక్టర్ డోలా ధ్వజం - టీడీపీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలసి మంత్రి మీడియా సమావేశం





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 22**

వైసీపీ నాయకులు తమ స్వార్థ రాజకీయాలకు వెంకటేశ్వర స్వామిని వాడుకోవడం సిగ్గు చేటు, దేవుడితో పెట్టుకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. ఆదివారం ఒంగోలులో ఎన్టీఆర్ భవన్ లో టీడీపీ ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దామచర్ల జనార్ధన్, జనసేన నాయకులు కంది రవిశంకర్, భాజాపా జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు తో కలసి మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... వైసీపీ హయాంలో జగన్ తన సొంత చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ బోర్డు చైర్మన్ గా నియమించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. గత 5 ఏళ్లు టీటీడీలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని, వైవీ సుబ్బారెడ్డి లడ్డులో కల్తీ జరిగింది వాస్తవమేనని మాట్లాడితే జగన్మోహన్ రెడ్డి మాత్రం కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారని అన్నారు. అసలు వైసీపీ ప్రభుత్వ హయాంలో తయారు చేసిన తిరుమల ప్రసాదం లడ్డూలలో నెయ్యేలేదని, సిట్ లో ఏమీ లేదని మాట్లాడుతున్నారని, దేవుడి మీద జగన్ కు, వైసీపీ నేతలకు విశ్వాసం లేదని మంత్రి మండిపడ్డారు. శాసనమండలిలో చెప్పులు వేసుకొని వెంకటేశ్వర స్వామి పటం తేవడం పద్ధతి కాదని, ఇది రూలింగ్ కాదని సభ వాయిదా వేసి వెళ్లినప్పటికి వైసీపీ సభ్యులు గొడవ సృష్టించారని అన్నారు. వైసీపీ సభ్యులు సభకు వచ్చినప్పుడు చెప్పులేసుకుని వెంకటేశ్వరస్వామి పటం చేతుల్లో పట్టుకొని జై జగన్ అంటూ నినాదాలు చేశారని ఇది ఎంతవరకు సమంజసం? అని అన్నారు. సభకు ఫోటోలు తీసుకురావడం క్షమించరాని నేరం అని, బయటకు వెళ్తూ బల్లల మీద వెంకటేశ్వరస్వామి పటాలను విసిరేసి వెళ్లారని, వైసీపీ నాయకులకు, జగన్ కు దేవుడి మీద నమ్మకం లేదని, హిందూ ధర్మం మీద, విశ్వాసాల మీద, కలియుగ ప్రత్యక్ష దేవుడి మీద నమ్మకం లేదన్నారు.వెంకటేశ్వరస్వామి పటాన్ని ప్లకార్డుల్లాగా చూశారే గాని వెంకటేశ్వర స్వామిలాగ చూడలేదని, బొత్స సత్యనారాయణ తమ సభ్యులు ఎవరు చెప్పులేసుకువెళ్లలేదు, చెప్పులు వదిలి వెళ్లారని అంటున్నారని, సభలో చెప్పులేసుకొని వెళ్లినట్లు వీడియో క్లిప్పింగ్స్ ద్వారా తెలుస్తోందని చెప్పారు. కానీ బొత్స సత్యనారాయణ చెప్పులేసుకొని వెళ్లలేదని బుకాయించడం సిగ్గుచేటన్నారు. దేవునితో పెట్టుకున్నారు 11 అయిపోయారు, నాడు రామతీర్థంలో రాముడి తల నరికారు చంద్రబాబు వెళ్తుంటే వెళ్లి నివ్వలేదు, వైసీపీ వ్యహరశైలి ప్రజలు గమనిస్తున్నారని, జగన్ చెప్పిన డైరెక్షన్ లో దేవుడితో రాజకీయాలు చేస్తే దానికి తగిన అనుభవిస్తారని విమర్శించారు. తిరుమలలో గోవింద నామ స్మరణ తప్ప వేరేది చేయకూడదని, వై.వి సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్ ఉన్న సమయంలో జగన్ పిన్నమ్మ జగన్ రక్షక గోవిందా అని చెప్పారని, అది గోవింద నామంలో లేదు, గోవింద నామాలలో లేని దాన్ని పలుకొచ్చా? అని ప్రశ్నించారు . సుబ్బారెడ్డి పిఎ చిన్న అప్పన్న అకౌంట్ లోకి నాలుగు కోట్ల 69 లక్షలు ఎలా వచ్చాయి? నాకు సంబంధం లేదని ఎలా చెప్తారు ? చేసిన అక్రమాలన్నీ చేసి సిగ్గు లేకుండా హెరిటేజ్ మీద బురద చల్లుతున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ అత్యున్నత చట్టసభ అయిన శాసనమండలిలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాల పట్ల వైసిపి నాయకులు ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని అన్నారు. దేవుడు చిత్రపటాలను బూట్లు, చెప్పులతో పట్టుకోవడం అనంతరం వాటిని నిర్లక్ష్యంగా విసరడం అత్యంత హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలు ఆధ్యాత్మిక విలువలు సంప్రదాయాలు గౌరవించడం ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి బాధ్యత అన్న సంగతి కూడా వైకాపా నాయకులు మరవడం దురదృష్టకరం అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ సమాజంలో శాంతి సామరస్యాన్ని కాపాడడం మనందరి బాధ్యత అని మీడియా ఈ అంశాన్ని బాధ్యతాయుతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఒంగోలు నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్ పాల్గొన్నారు.

# ప్రతిరోజూ పచ్చడి, పప్పుతోనే సరి

## -మెనూ అసలు పట్టించుకోరు -స్నాక్స్ అన్నమాటే లేదు

## -సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో దారుణం

## -టిఆర్ఆర్ కాలేజీ హాస్టల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

## -హాస్టల్లో గంటసేపు పరిశీలన -వార్డెన్‌ల పనితీరుపై తీవ్ర ఆగ్రహం











**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 22**

కందుకూరులోని టిఆర్ ఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేయటంతో.. బాలికలు పడుతున్న అవస్థలు వెలుగు చూశాయి. ఈ హాస్టల్ లో టి ఆర్ ఆర్ కాలేజీకి చెందిన ఇంటర్ డిగ్రీ విద్యార్థులతో పాటు నర్సింగ్ విద్యార్థినులు సుమారు 200 మందికి పైగా ఉంటున్నారు. ఎమ్మెల్యే తనిఖీకి వెళ్లిన సమయంలో ఇద్దరుకు గాను ఒక్క వార్డెన్ కూడా హాస్టల్లో లేరు. ముందుగా కిచెన్ లోకి వెళ్లిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పదార్థాలను పరిశీలించారు. ఎంతమంది బాలికలకు, ఎంత పరిమాణంలో వండుతున్నారు అనే విషయాన్ని ప్రత్యక్షంగా గమనించారు. ఈ సందర్భంగా మెనూ అసలు పాటించడం లేదని ఎమ్మెల్యే కి బాలికలు ఫిర్యాదు చేశారు. ప్రతిరోజు పప్పు, పచ్చడి తోనే సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం వేళల్లో ప్రతిరోజు స్నాక్స్ పెట్టడం మానేశారని చెప్పారు. కనీసం బెడ్స్ కూడా తగినన్ని ఇవ్వడం లేదని, అందుకే నేలపై పడుకుంటున్నామని తెలిపారు. ఈలోపు వార్డెన్ లు ఇద్దరు అక్కడికి రావడంతో, వారిపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ లో 200 మంది ఉంటున్నప్పుడు, కనీసం ఒక్కరైనా అందుబాటులో ఉండాల్సిన బాధ్యత లేదా అని గట్టిగా నిలదీశారు. మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సరుకులు పంపిణీ చేస్తుంటే, ఎందుకిలా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి హాస్టల్ పరిస్థితిపై ఫిర్యాదు చేశారు. తాను ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని, వార్డెన్లు ఇంత బాధ్యతారాహిత్యంగా ఉండడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు బాలికలతో మాట్లాడుతూ, తన ఫోన్ నెంబర్ మెనూ పట్టికలో రాయిస్తున్నానని, ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా తనకు చిన్న మెసేజ్ చేస్తే వెంటనే హాస్టల్ కు వస్తానని తెలియజేశారు. ఆయన వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

# మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు

## ఇప్పటికే 20 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

## సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు కృతజ్ఞతలు

## అభివృద్ధిలో రాజీలేదన్న ఎమ్మెల్యే ఇంటూరి

## 28.5 లక్షలతో నిర్మించిన సిసిరోడ్డు, డ్రైనేజీ ప్రారంభం



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 22**

కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎక్కడా రాజీపడకుండా కోట్ల రూపాయలతో పనులు చేస్తున్నట్లు కందుకూరి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని దివి శివలింగప్రసాద్ ఇంటి వద్ద నుంచి తాళ్లూరి రమణయ్య ఇంటి వరకు 28.5 లక్షలతో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు, సిసి డ్రైన్ ను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు వార్డు అధ్యక్షుడు కొచ్చర్ల తనూజ్ ఆధ్వర్యంలో స్థానికులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదన్నారు. ఎక్కడ చూసినా గుంతల రోడ్లు కనిపించాయని చెప్పారు. గత ఎన్నికల ప్రచార సమయంలో కూడా స్థానికులు ఈ రోడ్డు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరు పర్యటనకు వచ్చినప్పుడు, మున్సిపాలిటీ గురించి ఆయనకు వివరించడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన సీఎం, 50 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. అందులో భాగంగా ఇప్పటికే 20 కోట్ల నిధులు మున్సిపాలిటీకి విడుదల కాగా, వాటితో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వివరించారు. గత ఎన్నికల్లో కందుకూరు మున్సిపాలిటీ ప్రజలు తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన విషయాన్ని తాను ఎప్పటికీ మరిచిపోనని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కందుకూరు అభివృద్ధికి గురించి అడిగినప్పుడల్లా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో నిధులు ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారం మరువలేనిదని చెబుతూ వారిద్దరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇద్దరి సహకారంతో మునిసిపాలిటీలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని, రాబోయే రోజుల్లో కందుకూరును నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ కే.అనూష, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పార్టీ సీనియర్ నేతలు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కొడాలి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 22 సీఎం పర్యటన

# విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు



**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 22**

ఈనెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయ వంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు అధికారు లను ఆదేశించారు. ఆదివారం దోర్నాల మండలం వెలుగొండ ప్రాజెక్ట్ కార్యాలయం లో ముఖ్య మంత్రి పర్యటన విజయ వంతం చేయ డానికి తీసుకోవాల్సిన చర్యల పై జిల్లా కలెక్టర్ అధికా రులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25వ తేదీ దోర్నాల మండలం గంటవాని పల్లి ఫీడర్ కెనాల్ శంకుస్థాపనగా పనుల్లో పాల్గొంటారు. అనంతరం మార్కాపురం పట్టణం లో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వచ్చే ప్రజలకు త్రాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బహిరంగ సభ జరిగే ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు కలెక్టర్ చెప్పారు. అంతకుముందు కలెక్టర్ రాజాబాబు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్, హెలిప్యాడ్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, వెలు గొండ ప్రాజెక్ట్ ఎస్ఈ అబూ తాలిం ,డి.ఆర్. డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి , జిల్లా పరిశ్రమలశాఖ అధికారి శ్రీనివాస రావు, పంచాయ తీరాజ్ ఇ.ఇ సుబ్బా రెడ్డి, విద్యుత్ శాఖ ఇ.ఇ నాగేశ్వర రావు, ప్రాంతీయ రవాణా శాఖ అధికారి సుశీల, మార్కాపురం సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.



# అద్దంకిలో పోలీసుల విస్తృత నిర్బంధ తనిఖీలు

పత్రాలు లేని 29 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు సీజ్ -గంజాయి నిర్మూలనకై 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో భారీ ర్యాలీ

మత్తు పదార్థాలకు యువత దూరం కావాలి: దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ








**అద్దంకి(అర్సి ఇన్చార్జ్), పెన్ పవర్, ఫిబ్రవరి 22**

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అద్దంకి పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆదివారం అద్దంకి టౌన్‌లోని గరటయ్య కాలనీ, దాని పరిసర ప్రాంతాల్లో దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారు. అద్దంకి సీ.ఐ సుబ్బరాజుతో పాటు పలువురు ఎస్.ఐలు, 38 మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

**క్షుణ్ణంగా సోదాలు.. వాహనాల సీజ్**

ఆపరేషన్ లో భాగంగా కాలనీలోని ఇళ్లు, దుకాణాలు తదితర ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా సోదాలు చేశారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వలు, అక్రమ విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాలను ఉపయోగించి అనుమానితుల వేలిముద్రలను సరిచూశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 29 మోటార్ సైకిళ్లను, 5 ఆటోలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహన యజమానులకు చలానాలు విధించారు.

**'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన ర్యాలీ**

ప్రజలకు పలు సామాజిక అంశాల పై పోలీసులు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, పెరుగుతున్న సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు – శిక్షలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక ప్రజలు, యువత, వ్యాపారులతో కలిసి "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "గంజాయిని పారదోలుదాం -- డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం" అంటూ స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజం తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా చదువు, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు ఎస్.ఐ సురేష్, మేదరమెట్ల ఎస్.ఐ రఫీ, సంతమాగులూరు ఎస్.ఐ పట్టాభి రామయ్య, బల్లికురవ ఎస్.ఐ నాగరాజు, తాళ్లూరు ఎస్.ఐ మల్లికార్జున, దొనకొండ ఎస్.ఐ త్యాగరాజు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సంస్కృతి స్కూల్లో ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక








**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 22**

పట్టణంలోని గుర్రం వారి పాలెం లోని శ్రీ సంస్కృతి స్కూల్లో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకను అత్యంత ఉత్సాహంగా, భావోద్వేగాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిలుగా కొంకా లక్ష్మి నరసింహారావు, కొంకా చెంచమ్మ విచ్చేశారు. ఈ సందర్భంగా కొంకా లక్ష్మి నరసింహారావు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో ఒక కీలక మలుపనీ ఇక్కడ నేర్చుకున్న విలువలు భవిష్యత్తులో దిశా నిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. జూనియర్ విద్యార్థులు తమ సీనియర్లకు జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు విద్యార్థులు తమ పాఠశాల జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ప్రపంచ తెలుగు కవుల మహాసభలు

**- జిల్లా కవులుకు సత్కారం**



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 22**

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, జరుగుతున్న ప్రపంచ తెలుగు కవుల మహాసభలు శనివారం రాత్రి ఘనంగా ముగిసాయి. ఆంధ్రప్రదేశ్ జానపద కళలు అకాడమీమాజీ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ సభలకు సారధ్యం వహించారు. ప్రారంభ సభలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పాల్గొని తెలుగు భాష ఘనత గురించి చెప్పి, భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంఘం అధ్యక్షురాలు పొడపాటి తేజస్వి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన నెమ్మాని సీతారామమూర్తి, హరిప్రియా దేవి, దేవరకొండ ప్రసన్నాదేవి లను సత్కరించారు. జ్ఞాపిక , శాలువా బహుకరించి తెలుగు భాషకు వారు చేస్తున్నకృషిని అభినందించారు.

## టిడిపి కార్యాలయంలో మౌలానా ఆజాద్ వర్ధంతి

**-ఘనంగా నివాళులర్పించిన పార్టీ నేతలు**




**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 22**

దేశంలో విద్యారంగం అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని కందుకూరు టిడిపి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు ముస్లిం నేతలు ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 11 సంవత్సరాల పాటు భారత విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని నేతలు పేర్కొన్నారు. పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, మైనార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నజీర్, వార్డు అధ్యక్షులు గౌస్ బాషా, నాయబ్ రసూల్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, పార్టీ నేతలు సయ్యద్ జియావుద్దీన్, కాలేషా, జహీర్, హర్షద్, గౌస్ బాషా, ఖాదర్, హాజీ, వలీబాషా, నాయబ్ రసూల్, రఫీ, బాబు, ఖాదర్, ఆసిఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీల అభివృద్ధి

## తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యం

### టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22**

రాష్ట్రం లో ముస్లీం మైనార్టీల అభివృద్ధికోసం, సంక్షేమం కోసం నిత్యం పాటు పడుతుంది తెలుగుదేశం పార్టీయేనని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని పెద్ద మసీదు ప్రాంగణంలో 10 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముస్లీంలకు ఎన్నో సంక్షేమ పథకాలను గతంలో అందించారని,దుకాన్ మాకాన్, రంజాన్ తోఫా, మైనార్టీ స్కాలర్ షిప్,,హజ్ యాత్రికులకు రాయితీ లాంటి ఎన్నో పథకాలను అమలు చేసారని అన్నారు. తెలుగుదేశం హయాంలోనే షాదీఖానాల నిర్మాణాలు, మసీదుల, ఈద్గాల అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం ఖబరస్థాన్ బాగుకోసం సిమెంట్ రోడ్డు వేయడం సంతోషంగా ఉందని అన్నారు. ముస్లీమ్ మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన ముస్లీం సోదరులు కబరస్థాన్ సమస్యను ఎరీక్షన్ బాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, నిధులు కేటాయించి పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మజీద్ అధ్యక్షులు మొగల్ కరిముల్లా బేగ్,ముస్లీం మత పెద్దలు మౌలానా హీదాయతుల్లా, మౌలానా మొహమ్మద్ హుస్సేన్, మౌలానా జుబేర్, మౌలానా హనీఫ్, మక్కా మజీద్అధ్యక్షులు షేక్ సత్తార్,మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పి ఆర్ కాలనీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం





**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22**

గిద్దలూరు పట్టణంలో ని పి ఆర్ కాలనిలో గల శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో శ్రీభావాని శంకర స్వామి పరివారం సహిత అభయాంజనేయస్వామి నవగ్రహ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. విశ్వావసు నమాసంవత్సరం పాల్గుణ శుద్ధ పంచమి లు అశ్విని నక్షత్రయుక్త మేషలగ్న పుష్కరాంశము నందు అన్నదానం శివబాలకుమార్ బ్రహ్మత్వంన అవధానం మల్లికార్జున శర్మ పర్యవేక్షణ లో విగ్రహ ప్రతిష్టాకార్యక్రం వైభవంగానిర్వహించారు 20తేదీ నుంచి ప్రారంభమైన ఈకార్యక్రమం 21న ప్రాతః పూజ ,గ్రామోత్సవం యంత్రాలు అభిషేకం వివిధ హోమాలను అర్చక స్వాములు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలకు మహా స్నపనము, క్షీరాభిషేకం, దాన్యాధివాసం, శయాధి వాసం ,పుష్పాధివాసం అధివాస హోమం , కుంకుమార్చన కార్యక్రంమాలను నిర్వహించారు. ఆదివారం నాడు ప్రాతః కాలపూజ ప్రతిష్టా హోమం గర్త పూజ, యంత్రప్రతిష్టా, ప్రాణ ప్రతిష్టా బింబ కళాన్యాసాము లను వేదపండితులు నిర్వహించారు ఈ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం లో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టాకార్యక్రం అనంతరం మొదటి పూజాకార్యక్రం నిర్వహించి భక్తుల కు తీర్థ ప్రసాధాలనొసంగారు, భక్తులకు అన్నప్రసాధ వితరణ నిర్వహిచారు. ఇదే సందర్భంలో భూరి విరాళం ఒసంగిన దాతలను ఘనంగా సన్మానించారు. శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వేదపండితుల వేద మంత్రోచ్ఛారణ లతో ఆలయం దద్దరిల్లింది. భూరి విరాళం నొసంగిన దాతలకు ఆల్యానిర్వహకులు ధన్యవాదాలు తెలిపారు.

# నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 22**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహ బాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నారాయణస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దైవదర్శనం పొందారు. అభిషేక సమయంలో దేవస్థానం పరిసరాలు మంత్రోచ్ఛారణలతో మార్మోగాయి. పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలతో అర్చకులు స్వామివారికి సంప్రదాయ ప్రకారం అభిషేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి భూదేవి సమేత విష్ణు మూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు అనంతరం గోపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గోశాల వద్ద గోవును పవిత్రంగా అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేయగా భక్తులు శాంతి, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. తదుపరి దేవస్థానం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో దాసరి నారాయణస్వామి, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉయ్యాలవాడకు ఘన నివాళులు

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 22**

ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్టెప్ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్టెప్ సిఈఓ పి శ్రీమన్నారాయణ పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్, స్టెప్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# నేడు 13 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 22**




కొమరోలు మండలం తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 13 గ్రామాలను ఈనెల 23వ తేదీ సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా మండలంలో అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాట్లలో భాగంగా ఈ నెల 23వ తేదీ సోమవారం తాటిచెర్ల మోటు సబ్ స్టేషన్ పరిధిలోని దద్దవాడ ,నాగిరెడ్డిపల్లె, అలసందలపల్లి, నారాయణ పల్లి, గుండ్రెడ్డిపల్లి, వెంకటం పల్లి, తాటిచెర్ల, హసనాపురం, ముత్తురాసు పల్లి, పొట్టి పల్లి, కంకరవానిపల్లి, కె అక్కపల్లి, గోవిందపల్లి గ్రామాల పరిధిలో కొత్త లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. ఆ కారణంగా సదురు 13 గ్రామాలకు ఈ నెల 23వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లుగా శ్రీనివాసులు తెలిపారు.

# పరీక్షలు జీవన మరణ సమస్య కాదు

## పరీక్షలంటే ప్రగతికి సోపానంచేసే నిరంతర ప్రక్రియ.

## పరీక్షలంటే జీవన విధానాన్ని నిర్ణయించేవి..-జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూప రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22**

ఫిబ్రవరి మార్చిలో రెండు తెలుగు రాష్ట్రాలలో 10వ తరగతి,ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.ఏడాది పొడవునా చదివిన విద్యార్థులకు, వారి భవిష్యత్తు మీద కొండంత ఆశ పెట్టుకున్న తల్లిదండ్రులకు కీలక సమయం ఆసన్నమైంది. రాసే పరీక్షలు విద్యార్థుల భవితవ్యాన్ని తేల్చనున్నాయి. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగిపోతూ ఉంటుంది. ఈ పరీక్షల సన్నద్ధత సమయంలో పాటించాల్సిన మెళకువల గురించి అందరూ తెలుసుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు .పి స్వరూప రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే చాలా పాఠశాలల్లో,కళాశాలల్లో సిలబస్ పూర్తయినందున 80 శాతం సమయం పునఃశ్చరణకు, మిగిలిన 20 శాతం సమయం కొత్త అంశాలు నేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోజంతా ఒకే సబ్జెక్టును చదవకుండా వివిధ సబ్జెక్టులు నేర్చుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని. కొంతమంది విద్యార్థులు గ్రూపు సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ లాంగ్వేజెస్ నిర్లక్ష్యం చేస్తారు.అలాకాకుండా రెంటికి సమ ప్రాధాన్యం ఉండేట్టు చూసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఆహారము, నిద్ర, వ్యాయామానికి తగిన ప్రాధాన్యతనిస్తుండాలన్నారు. ప్రతిరోజు ఒకే సమయానికి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలని. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. తాజాపండ్లు, డ్రై ఫ్రూట్స్, పాలు వంటి ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని. నిద్రకు ఖచ్చితంగా 7 నుంచి 8 గంటల సమయం కేటాయించాలన్నారు. ఒక గంట సమయం చదివిన తరువాత మెదడుకు 5 నిమిషాలు విరామం ఇవ్వడం ద్వారా తిరిగి ఉత్సాహంతో చదవగలుగుతారన్నారు . కొద్దిసేపు సూర్యకాంతిలో నడక, పచ్చని మొక్కల మధ్య నడవడం లాంటివి చేయాలన్నారు. టీవీ,మొబైల్స్, సోషల్ మీడియాకు కొంత కాలం దూరంగా ఉండాలని తెలిపారు. మిమ్మల్ని మీరు నమ్ముకోండి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల మీద ఆధార పడకూడదన్నారు. ఒకరితో పోల్చుకుంటూ చదవడం అసలు చేయరాదని. పరీక్షకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను నోటు పుస్తకంలో రాసుకోవాలన్నారు. పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు టిక్ చేసుకుంటూ ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రతి సబ్జెక్టుకు కనీసం 5 మోడల్ ప్రశ్నపత్రాలను ప్రిపేర్ కావడం చేయాలని. ఒంటరిగా చదవడం కంటే ఇద్దరు ముగ్గురు బృందంగా చదవడం మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. సందేహాలను ఉపాధ్యాయులు, తోటి స్నేహితుల ద్వారా ఎప్పటికప్పుడు తీర్చుకోవాలని. ఈ జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలు రాస్తే మంచి మార్కులు పొందవచ్చునన్నారు. అదే విధంగా అనవసరమైన ఆకర్షణలకు దూరంగా ఉండాలని.వివాదాలకు దూరంగా ఉండాలి.పరీక్షా కేంద్రాల గురించి ముందే తగిన సమాచారం తీసుకోవాలి.ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా వుండాలన్నారు.చదువు బతుకు నివ్వాలి, బతక నివ్వాలి.విద్య విజ్ఞానాన్ని పెంచాలి. సామాజిక వికాసాన్ని పంచాలి. దేశీయంగా విద్యార్థులను వరీయర్స్ (విచారగ్రస్తులు)కాకుండా వారిని వారియర్స్(యుద్ధ యోధులు)మార్చాలని పరీక్ష అంటే జీవితానికి అగ్ని పరీక్ష కాదు. ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని నిరుత్సాహ పడకుండా మన ప్రయత్నాన్ని కొనసాగించాలమీ.మీరు విజేతలు కావాలా ,పరాజితులు కావాలా అనేది మీచేతిలో వుందన్నారు. పరీక్షలు ఓ పండుగలా, వేడుకలా భావించాలన్నారు. పరీక్షలను భారం అని కాక అవకాశంగా చూడండి -- పరీక్షలు మీ జ్ఞానాన్ని ప్రదర్శించడానికి మంచి అవకాశం. భయపడకుండా, సవాల్‌గా స్వీకరించండి. మీతో మీరే పోటీ పడండి -- ఇతరులతో పోల్చుకోవడం మానేసి, గతంలో మీరెంత ముందుకు వెళ్లారో పరిశీలించి, మరింత మెరుగుపడాలని ప్రయత్నించండి. సంతులిత జీవనశైలి పాటించండి -- సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే మనస్సు, శరీరం ఉత్తమ స్థితిలో ఉంటాయి.సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి -- పాఠాలను అర్థం చేసుకోవడానికి టెక్నాలజీని ఉపయోగించండి. అయితే, దీని వల్ల మిమ్మల్ని గందరగోళానికి గురిచేసే విషయాలను దూరంగా ఉంచండన్నారు.నిజమైన లక్ష్యాలు పెట్టుకోండి -- మీ సామర్థ్యానికి అనుగుణంగా సాధ్యమైన లక్ష్యాలను నిర్ణయించుకొని, క్రమంగా వాటిని పెంచండన్నారు. అమ్మ, నాన్న, గురువులతో మాట్లాడండి -- ఏమైనా సందేహాలు ఉంటే, వారితో చర్చించండి. కొత్తదనం తెలుస్తుందని. అభిరుచులకు ప్రాధాన్యం ఇవ్వండి -- చదువుతో పాటు కళలు, క్రీడలు తదితర ఇతర పనుల్లోనూ పాల్గొంటే ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. బాహ్యా యావత్తును పట్టించుకోకండి -- స్టేడియంలో ఆడే క్రీడాకారుడిలా ఉండాలి. భయాలను, ఒత్తిడిని పక్కన పెట్టి, మీ లక్ష్యంపై దృష్టి పెట్టండి. శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచండి -- రోజూ వ్యాయామం చేస్తే, మెదడు ఉల్లాసంగా ఉంటుంది. మీ సామర్థ్యంపై నమ్మకం పెట్టుకోండి -- మీ శక్తులపై నమ్మకం పెంచుకుంటే పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయి. ఇతరులతో పోల్చుకోవడం మానేయండి -- మీ ప్రయాణం మీది. ఎవరి విజయాన్ని చూసినా, అదో ప్రేరణగా తీసుకోవాలి, కానీ మిమ్మల్ని తక్కువ చేసుకోవద్దు. జిజ్ఞాస కలిగి ఉండండి -- మీ పాఠ్యపుస్తకాల్లోని విషయాలకే పరిమితం కాకుండా కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తి చూపండి. మెదడును ప్రశాంతంగా ఉంచండి -- రోజూ ధ్యానం, యోగాలు చేస్తే మానసిక ఒత్తిడి తగ్గిపోతుంది.చిన్న విజయాలను కూడా ఆనందించండి -- మీరు సాధించిన ప్రతి చిన్న విజయాన్నీ గౌరవించండి. అది మీలో కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తుంది.ఈ సూచనలను పాటించడం ద్వారా విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవచ్చు, పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా తయారవుతారు. “పరీక్ష ఒక భయంకరమైనది కాదు, మీరు మీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాల్సిన సమయం” అని స్పష్టం చేశారు.

## మంత్రులతో కదిరి బాలకృష్ణ ఆత్మీయ కలయిక



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 22**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీనివాసులురెడ్డిని కదిరి బాబురావు విద్యాసంస్థల కోశాధికారి కదిరి బాలకృష్ణ ఆదివారం హైదరాబాద్ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా స్నేహపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా మంత్రులతో బాలకృష్ణ పలు విషయాలపై అభిప్రాయాలు అదేవిధంగా క్లాస్మేట్స్ గా ఉన్న పాత స్నేహితులైనందున ఆత్మీయంగా పరస్పరం అభినందనలు తెలియజేసుకుంటూ స్మృతులను పంచుకున్నారు.

## ఆక్స్‌ఫర్డ్ లో ఘనంగా 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ వేడుకలు





**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 22**

పట్టణంలోని పామూరు రోడ్ నందు ఉన్న స్థానిక బి. ఆర్.ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్ లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడు కలు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ చైల్డ్ సైక్యాట్రిస్ట్ మోటివేషనల్ స్పీకర్ సి. హెచ్. స్వర్ణకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులను ఉద్దేశిం చి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తులో 10వ తరగతి ఒక కీలకమైన మలుపు అని పేర్కొన్నారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో పిల్లలపై అనవసరమైన ఒత్తిడి తీసుకురాకూడదని, వారి మానసిక స్థితిని అర్థం చేసుకుని స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పిల్లల ఆసక్తిని గమనించి, వారి నైపుణ్యాలకు అనుగుణంగా భవిష్యత్తు ప్రణాళిక ఎంచుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. బిఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ భాస్కరరావు మాట్లాడుతూ.విద్యార్థులకి ర్యాంకులు, మార్కుల కోసమే కాకుండా మానసిక ఆరోగ్యం పట్ల కూడా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు విద్యార్థిని విద్యార్థులకు వారి విలువైన సందేశాన్ని తెలియజేసారు. అనంతరం యాజమాన్య సిబ్బంది స్వర్ణకుమారి ని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కరరావు బి. నరేంద్రబాబు,పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## ఇంటర్ విద్యార్థులకు ఆల్ ద బెస్ట్

### ఎమ్మెల్యే డాక్టర్. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి





**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 22**

ఈ రోజు నుంచి మార్చి 24వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి విద్యార్థి గొప్పగా రాసి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ డాక్టర్. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కోరారు. ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పాల్గొని, ప్రతి సబ్జెక్ట్‌లో అద్భుతంగా రాసి విజయం సాధించండి. ఒత్తిడికి లొంగకండి, సమయాన్ని మెల్లగా మేనేజ్ చేసుకోని మీ కలల మీ భవిష్యత్తు రావాలి ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు.

## ఆకవీడులో నీటి కోసం కష్టాలు

**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22**

రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో గత పది రోజులుగా పంచాయతీ బోరు మరమ్మతులకు గురై ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు.సమస్యపై సర్పంచ్, సెక్రటరీలకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోరు మరమ్మతులకు నోచుకోక నీరు రాక పసుపోషక రైతులు గ్రామస్తులు మైళ్ల దూరం ప్రయాణం చేసి తాగునీటిని తెచ్చుకోవలసిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. అయినా అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి సమస్యలను తీర్చి ప్రజలకు నీటిని అందించాలని కోరుకుంటున్నారు.నిరుపయోగంగా ఉన్న బోరు బావుల వల్ల ముఖ్యంగా చిన్నారుల భద్రతపై ఆందోళన నెలకొందన్నారు.



## ఈ ఏడాది మే 31న పదవి విరమణ చేయనున్న వెంకటరత్నం.

### కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ వెంకటరత్నం ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు.



**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 22**


కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 బొర్రా వెంకటరత్నం ను పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి ముందస్తు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2గా విధులు నిర్వహిస్తున్న బొర్ర వెంకటరత్నం ఈ ఏడాది మే 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు .అయితే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కావడం, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే నెల నుంచి ప్రారంభం కావలసి ఉన్న సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 21వ తేదీ శనివారం కొమరోలు ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం అనంతరం కొమరోలు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శివ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ 2 బొర్ర వెంకటరత్నం పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి ముందస్తు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందర్భంగా వెంకటరత్నం గుణగణాలను ఆయన మండలంలో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో వ్యవహరించిన స్నేహపూర్వక విధానాలను, కొనియాడుతూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సున్నిత మనస్కుడు, సహృదయుడు, విధుల పట్ల అంకితభావం, స్నేహశీలి, నిరాడంబరత్వం , నిగర్వి తదితర సద్గుణాలు కలిగిన వెంకటరత్నం ఎంఈఓ గా ఉద్యోగ విరమణ చేయవలసి ఉండటం మండలానికి ముఖ్యంగా విద్యాశాఖకు తీరని లోటు అని వెంకటరత్నంలాంటి అధికారి లభించడం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు చేసుకున్న అదృష్టమని పలువురు వ్యాఖ్యానించారు. వెంకటరత్నం ఎప్పుడూ కూడా తాను అధికారిని అనే భావన, దర్పం చూపక తమతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ విద్యాభివృద్ధికి,,పాఠశాలల అభివృద్ధికి అమూల్యమైన సూచన సలహాలు ఇస్తూ తమను ముందుకు నడిపించారని ,ఆయన స్ఫూర్తితోనే తాము విధులు నిర్వహిస్తూ పాఠశాలకు మండలానికి విద్యాశాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి పెడుతున్నామని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు . వెంకటరత్నం ఎంఈఓ పదవికి వన్నె తెచ్చారని అంటూ ,ఎంఈఓ స్థాయి అధికారి పాఠశాలలకు వస్తున్నారంటే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఒకింత ఆందోళన ఉంటుందని, అయితే ఎంఈఓ వెంకటరత్నం పాఠశాలను సందర్శిస్తున్నారంటే ఒక మంచి స్నేహితుడు తమ పాఠశాలకు వస్తున్నాడనే భావన తమలో కలుగుతున్నదని పలువురు పేర్కొన్నారు. ఆ సందర్భంగా పాఠశాలల వారీగా పలువురు ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు ఎంఈఓ వెంకటరత్నం ను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించి ముందస్తు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. తన పదవీ విరమణను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా తను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరికీ వెంకటరత్నం ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో మండలంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వాహనాల దుండగులు అరెస్టు

## 14 లక్షల రూపాయల విలువైన వాహనాలు స్వాధీనం



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22**



ఎటువంటి కాయకష్టం లేకుండా సులభంగా డబ్బు సంపాదించాలని ఆశించి మార్కాపురం జిల్లాలో పలు వాహనాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దుండగులను బెస్తవారిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్కాపురం డిఎస్పీ నాగరాజు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లాకు చెందిన గంగాధర్ రావు, కడప జిల్లాకు చెందిన ప్రసాద్ గత కొంతకాలంగా కలిసి వాహన చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. కొన్ని నెలల క్రితం గిద్దలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో టాటా ఇంట్రా ఆటోను చోరీ చేయడంతో పాటు, బెస్తవారిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ట్రాక్టర్‌ను అపహరించినట్లు తెలిపారు. అంతేకాకుండా మరో నాలుగు ద్విచక్ర వాహనాలను కూడా చోరీ చేసినట్లు వెల్లడించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారని వారి వద్ద నుండి సుమారు రూ.14 లక్షల విలువైన చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ నాగరాజు తెలిపారు. ఈ ఇద్దరు నిందితులపై రాష్ట్రవ్యాప్తంగా పలు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన దుండగులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మార్కాపురం జిల్లా డి.ఎస్.పి నాగరాజు గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, బెస్తవారిపేట ఎస్ఐ కె. రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఉపవాసదీక్షలో చిన్నారుల ఔదార్యం



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 22**

పట్టణానికి చెందిన చిన్నారి తలలో క్యాన్సర్ గడ్డతోబాధపడుతుందన్న విషయం తెలుసుకున్న ముస్లీం చిన్నారి విద్యార్థులు తమ వంతుగా సహాయం అందించారు.పట్టణంలో టైలర్ గా జీవనం సాగిస్తున్న నారాయణ కుమార్తె తొమ్మిదేళ్ల గోపిక పూర్ణిమ క్యాన్సర్ తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న చిన్నారి విద్యార్థులు, తమ వీధులలో పరిచయస్తుల వద్ద విరాళాలు సేకరించారు. సేకరించిన 3,550 రూపాయలు గోపి పూర్ణిమ తండ్రివెంకట నారాయణకు మత పెద్దల సమక్షంలో అంద జేశారు.రంజాన్ ఉపవాసదీక్షలో ఉన్న 6,7వ తరగతి చదువుతున్న, సయ్యద్ సిద్ధిక్,తోఫీద్, సీమాల్, జోఫీద్, మహమ్మద్ లుసేవా దృక్పథం చాటుకున్నారు.

# కొమరోలు లోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య.

**ఈనెల 23 నుంచి వచ్చే నెల 18 వరకు పరీక్షా కేంద్రం వెలుపల 144 సెక్షన్ అమలు.**

**పరీక్షా కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ ,నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశం.**

**పరీక్షా గదిలోనికి కాపీలు పంపించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు.**

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 22**

కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఆదివారం గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య ,కొమరోలు ఎస్సై జె నాగరాజు తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి వచ్చే నెల 18 తేదీ వరకు జరగనున్నాయి.అందులో భాగంగా కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు .ఆ కేంద్రంలో కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన విద్యార్థులతో పాటు కొమరోలు లోని శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాజుపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లోని ఇంటర్మీడియట్ బాలికలు మొత్తం 525 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు రాయనున్నారు .పరీక్షల నిర్వహణకు పరీక్ష కేంద్ర చీఫ్ సూపరిండెంట్ ఎస్ ప్రభాకర్ డిపార్ట్మెంట్ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.కాగా ఆదివారం గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య కొమరోలు ఎస్సై నాగరాజ్ తో కలిసి ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు వీలుగా పరీక్షా కేంద్రం వెలుపల పరీక్షలు జరిగే సమయంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు.ఈనెల 23వ తేదీ




నుంచి వచ్చేనెల 18 తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అంతేకాక పరీక్షా కేంద్రం చుట్టూ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు.అందువల్ల ప్రజలు పరీక్షా కేంద్రం సమీపంలో గుంపులు గుంపులుగా ఉండకూడదని, అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.పరీక్షా కేంద్రం సమీపంలోని జిరాక్స్ సెంటర్లను ,నెట్ సెంటర్లను వాటి నిర్వాహకులు స్వచ్ఛందంగా మూసివేయాలని హెచ్చరిస్తూ




ఇప్పటికే వారికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. పరీక్ష కేంద్ర వెలుపల నుంచి ఎవరైనా పరీక్ష గదిలోనికి కాపీలు పంపించే ప్రయత్నం చేయవద్దని అలా చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని అంటూ గతంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా జరిగిన సంఘటనలను, మైనర్లపై నమోదైన కేసులను ఉదాహరిస్తూ ఆయన హెచ్చరించారు. అనంతరం సీఐ రామకోటయ్య కొమరోలు ఎస్సై నాగరాజుకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## సెయింట్ మార్క్స్ విద్యార్థికి జిల్లా స్థాయిలో స్థానం

**పామూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 22**



ఒంగోలు పేస్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వక్త -2026 అనే కార్యక్రమం పై జిల్లా స్థాయిలో హైస్కూల్ విభాగంలో వక్తృత్వ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో సెయింట్ మార్క్స్ విద్యార్థి పందిటి వెంకటసాయిశంకర్ (9వతరగతి) ప్రతిభ కనబరిచి జిల్లా తృతీయ బహుమతి సాధించాడు. ప్రస్తుతం ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ అనే అంశంపై ఈ విద్యార్థి మాట్లాడడం జరిగినది. ఫిబ్రవరి 28 గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వెంకట సాయి శంకర్ ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరూ వారి హర్షధ్వానాలతో వెంకటసాయిశంకర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మారెడ్డి, అధ్యక్షత వహించగా పామూరు మండల జె.వి.వి అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ సెక్రటరీ మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెయింట్ మార్క్ మేనేజ్మెంట్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని మరియు అతని తల్లిదండ్రులైన పందిటి వెంకట సత్యనారాయణ, ధనలక్ష్మి లకు పలువురు అభినందనలు తెలిపారు.

## గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మేళనానికి బయలు దేరిన డాక్ సేవకులు



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 22**

గుంటూరులో ని ఆదివారం కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి జ్యోతిరాదిత్య సిందియా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ ల సమ్మేళనానికి గిద్దలూరు సబ్ డివిజనల్ అధికారిశ్రీనివాసులు అధ్వ వర్యంలో షుమారు 200మంది డాక్ సేవ కులు బయలుదేరివెళ్లారు వారికి ప్రభుత్వం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈసందర్బంగా కమ్యూనికేషన్ మంత్రి సిందియా డాక్ సేవకులసేవలను కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలను మెరుగుపర్చాలని, తపాలా శాఖ అమలు చేస్తున్న స్కీములను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సేవిన్స్ బ్యాంకు ఆర్డీ ,సుకన్య సమృద్ధి యోజన, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స, పోస్టల్ లైఫ్ ఇన్సురెన్సు లను ప్రతి వ్యక్తి తో చేయించాలన్నారు. తపాలశాఖలో గ్రామీణ డాక్ సేవకులు పట్టుకొమ్మలని తపాలా సేవలు గ్రామాల్లో విస్తృతం చేయాయని కోరారు. ఈకార్యక్రమంలో ఏ పి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కేంద్రమంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**కమిటీలో అద్దంకి వీఆర్వోలకు సముచిత స్థానం**



**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్), పెన్ పవర్, ఫిబ్రవరి 22**

ప్రకాశం జిల్లా ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం (రిజిస్టర్ నెం. 1/2018) నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక ఒంగోలు పట్టణంలోని ఏపీటీఎఫ్ భవనంలో ప్రశాంత వాతావరణంలో జరిగింది. సంఘం సభ్యులందరూ సమావేశమై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల సంఘం (గ్రేడ్-2) రాష్ట్ర అధ్యక్షులు బయ్యవరపు. శామ్యూల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అద్దంకి. మాచర్ల హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు వారు ప్రత్యేకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అద్దంకి కి చెందిన వీఆర్వో బొంతు. సుధాకర్ మాట్లాడుతూ.. తన పై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల పదోన్నతులు, వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అహర్నిశలు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

**నూతన కార్యవర్గంలో అద్దంకి కి పెద్దపీట**

నూతనంగా ఏర్పడిన జిల్లా కార్యవర్గంలో అద్దంకి నియోజకవర్గానికి చెందిన వీఆర్వోలకు సమూచిత స్థానం దక్కింది. కీలక బాధ్యతల్లో అద్దంకి నియోజకవర్గానికి చెందిన వీఆర్వోలు ఎంపిక కావడంతో స్థానిక రెవెన్యూ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా బి. రాజశేఖర రెడ్డి, ట్రెజరర్ లగా బి. అశోక్, జి. యలమంద రావు, అలాగే మహిళా అధ్యక్షురాలిగా జె. శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు.

## దోమల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి - సిపిఎం

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 22**

ఒంగోలు నగర శివారు కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతి మూడు రోజులకు ఒకసారి సరిపడా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం ఒంగోలు నగర పార్టీ సభ్యులకు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ప్రిన్సిపాల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో మాబు మాట్లాడుతూ నగరంలోని సుమారు 60 శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతోందని, ప్రస్తుతం వారానికి ఒక్కసారి మాత్రమే ఇంటికి రెండు డ్రమ్ముల చొప్పున నీరు ఇస్తున్నారని తెలిపారు. కొన్ని కాలనీలలో 10 రోజులైనా ట్యాంకర్లు రాని పరిస్థితి ఉందన్నారు. దీంతో ప్రజలు వందల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు వేసవి దృష్ట్యా ప్రతి మూడు రోజులకు ఒకసారి సరిపడా నీరు అందించాలన్నారు. ప్రతి సంవత్సరం ట్యాంకర్ల కోసం కోటి రూపాయల వరకు నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు లేవని పేర్కొన్నారు. అన్ని కాలనీలకు పైప్‌లైన్లు వేసి ఇంటింటికీ కొళాయిల ద్వారా రక్షిత మంచినీటిని అందించాలన్నారు. చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో దోమల సమస్య కూడా తీవ్రరూపం దాల్చిందన్నారు.పగలు, రాత్రి తేడా లేకుండా దోమల వ్యాప్తి




వల్ల విషజ్వరాలు ప్రబలుతున్నట్లు, పసిపిల్లలు, పేదలు ఆసుపత్రుల పాలవుతున్నారనిచెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరుగుతున్నాయని తెలిపారు. పోతురాజు కాలవలో ప్లాస్టిక్, చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహం ఆగిపోవడంతో సమస్య మరింత తీవ్రమైందన్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు జి రమేష్, తంబి శ్రీనివాసులు, ఎస్‌డీ హుస్సేన్, ఎన్ వీరాస్వామి, బివి రావు, కె శ్రీనివాసరావు, డి వెంకటేశ్వర్లు, జి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగ పింఛన్ కోసం ఎమ్మెల్యేను కలసిన నాగరాజు

**పింఛన్ హామీ ఇచ్చిన ఎమ్మెల్యే**



**ఉలవపాడు, పెన్ పవర్, ఫిబ్రవరి 22:**

మండలంలోని వీరేపల్లి గ్రామ పంచాయతీలో నివాసం ఉంటున్న వికలాంగ వ్యక్తి పాలకీర్తి నాగరాజు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును పింఛన్ మంజూరు కోసం కలిశారు. పాలకీర్తి నాగరాజు పుట్టుకతోనే వికలాంగుడు అయినప్పటికీ ఇప్పటివరకు అతనికి పింఛన్ మంజూరు కాలేదని నాయకులు ఎమ్మెల్యేకు తెలిపారు. గతంలో పలుమార్లు పలువురు నాయకులను అడిగిన ఫించన్ మంజూరు కాలేదని నాగరాజు ఎమ్మెల్యే ముందు వాపోయాడు. నాగరాజు తన పింఛన్ విషయమై స్థానిక నాయకులు అయిన సత్యం, నరసింహ తదితరులను కలవడంతో వారు అతని పరిస్థితిని అర్థం చేసుకొని ఎమ్మెల్యే ఇంటూరి వద్దకు తీసుకొనిపోయారు. అతని కష్టాన్ని విన్న ఎమ్మెల్యే కచ్చితంగా నీకు పింఛన్ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో వికలాంగుడైన నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొల్లపూడి సత్యం, దోనంపూడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునలో ఘనంగా ఎస్ ఎస్ సి విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్

**-విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలి -ఎంఈఓ శర్మ**

**-చదువుతోపాటు సమాజ విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలి -ప్రతిభ డైరెక్టర్ నల్లూరి జయప్రకాష్**

**-విద్యార్థులను ఉన్నత ప్రమాణాలతో తీర్చి దిద్దుతున్న నాగార్జున - అప్స్మ ప్రెసిడెంట్ జి రామారావు**

**-విద్యార్థులకు క్రమశిక్షణ, ఉన్నత ప్రమాణాలతో బోధన చేస్తాము -డైరెక్టర్ వి. షాలిని రెడ్డి**




**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 22:**

నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్ నాగార్జున ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఈఓ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని చదువు నేర్పిన పాఠశాల తో పాటు తల్లిదండ్రులకు యాజమాన్యానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా ఉన్నత శ్రేణిలో ఫలితాలు సాధించాలని అభిలాషించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ నల్లూరి జయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు అకాడమిక్ చదువులతో పాటుగా సమాజం లోని శాస్త్ర సాంకేతిక రంగాల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకొని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అప్స్మ ప్రెసిడెంట్ జి రామారావు మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలను నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ గత కొన్ని సంవత్సరాలుగా సాధిస్తుందని ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాలను సాధించి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని అన్నారు. నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ వి. షాలిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల ఏర్పడినప్పటి నుండి మా ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఉన్నత ప్రమాణాలు కలిగిన చదువును అందిస్తు న్నామని దీనివలన ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్న తల్లిదండ్రు లకు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఫేర్వెల్ ఫంక్షన్స్ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా అందంగా అలంకరించి విద్యార్థులందరను ఎంతో ఉత్సాహంగా పాల్గొనేటట్టు వాతావరణం కల్పించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం వి. మల్రెడ్డి,కరణం శ్రీనివాసరావు విద్యార్థిని,విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే, ఎమ్మార్వో, మానవతా





**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 22**

తెల్లవారుజామున పట్టణ సమీపంలోని గోపాలపురం జాతీయ రహదారి 565 వద్ద యాక్సిడెంట్ కు గురైనటువంటి కర్ణాటక ప్రాంతానికి చెందినటువంటి క్షతగాత్రులను ఒంగోలు పార్లమెంటు సభ్యులు, కనిగిరి శాసనసభ్యులు ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పరామర్శించి రూ 25 వేల రూపాయలు సొంత నిధులతో వాహనం ఏర్పాటు చేయించి వారిని తమ సొంత గ్రామమునకు వెళ్ళుటకు వాహనం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్రనరసింహరెడ్డి మానవత్వం చాటుకున్నారు. ఆయనతోపాటు మండల తాసిల్దార్ వాసుదేవరావు రూ.15.000 మానవతా సేవా సంస్థ సభ్యులు రూ. 5000. పూర్వ అధ్యక్షులు మెడబలిమి ముసలయ్య గాయపడిన వారికి 20 మందికి ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు మానవత్వం చాటుకున్నారు.

# గ్రీన్ కార్డ్ కోసం 19 నెలల నిరీక్షణ: అమెరికా వలస వ్యవస్థలోని 'అనిశ్చితి'కి నిలువుటద్దం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా కలని నిజం చేసుకునే క్రమంలో గ్రీన్ కార్డ్ అనేది ఒక కీలక మైలురాయి. అయితే ఆ మైలురాయిని చేరుకోవడానికి కొందరికి పట్టే సమయం వర్ణనాతీతం. ఇటీవల ఒక వలసదారుడు రెడ్డిట్ వేదికగా పంచుకున్న తన 19 నెలల సుదీర్ఘ నిరీక్షణ కథనం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఒక వ్యక్తి ఆవేదన మాత్రమే కాదు.. వేలాది మంది వలసదారులు ఎదుర్కొంటున్న వ్యవస్థాగత జాప్యానికి నిదర్శనం.

**ఒక దరఖాస్తు.. రెండేళ్ల నిరీక్షణ**

సదరు అభ్యర్థి సెప్టెంబర్ 2024లో కుటుంబ ఆధారిత వలస కోసం ఐ-130 , ఐ-485 దరఖాస్తులను సమర్పించారు. ఫిబ్రవరి 2025లో ఐ-130 ఆమోదం పొందినప్పటికీ అసలైన ఐ-485 మాత్రం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సాధారణంగా ఐ-130 ఆమోదం పొందాక ప్రక్రియ వేగవంతం కావాలి.. కానీ ఇక్కడ 19 నెలలు గడిచినా ఫలితం లేకపోవడం గమనార్హం.

**పాక్షిక ఊరట.. కానీ పూర్తి భరోసా లేదు..**

ప్రస్తుతానికి సదరు అభ్యర్థికి వర్క్ ఆథరైజేషన్ (ఈఏడీ) , అడ్వాన్స్ పరోల్ (ట్రావెల్ పర్మిట్) లభించాయి. ఇంటర్వ్యూ లేకుండానే ఇవి ఆమోదం పొందడం సానుకూలాంశమే అయినా అవి తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే. ఇప్పటికీ సదరు అభ్యర్థి ఎఫ్-1 స్టూడెంట్ వీసా స్టేటస్‌లోనే కొనసాగుతున్నారు. గ్రీన్ కార్డ్




చేతికి వచ్చే వరకు కెరీర్ , వ్యక్తిగత జీవితంలో ఎటువంటి ధీమా ఉండదు. ఏ క్షణంలో ఏ మార్పు వస్తుందో అన్న భయం వలసదారులను వేధిస్తోంది.

**జాప్యానికి కారణాలు ఏమిటి?**

వలస నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఈ జాప్యానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. యూఎస్.సీఐఎస్ కి చెందిన కొన్ని ఫీల్డ్ ఆఫీసులు వేగంగా పని చేస్తాయి. మరికొన్ని ఆఫీసుల్లో దరఖాస్తుల భారం ఎక్కువగా ఉండటం వల్ల ఏళ్ల తరబడి సమయం పడుతుంది. అభ్యర్థి స్థానిక కాంగ్రెస్ ప్రతినిధి ద్వారా విచారణ జరిపించినా యూఎస్.సీఐఎస్ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం.. వ్యవస్థలో ఉన్న పారదర్శకత లోపాన్ని సూచిస్తోంది.

**బాధితులకు ఉన్న మార్గాలేమిటి?**

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారు చట్టపరమైన నిపుణుల సలహా మేరకు నడుచుకోవాలి. మొదటి ఇంక్వైరీ జరిగి చాలా కాలం అయినందున, మరోసారి ప్రజా ప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకురావడం ముఖ్యం. ప్రభుత్వం తన విధిని సక్రమంగా నిర్వహించనప్పుడు కోర్టు ద్వారా ఆదేశాలు జారీ చేయించడం. ఇది యూఎస్.సీఐఎస్ ని నిర్ణయం తీసుకునేలా నిర్బంధిస్తుంది. ఇమ్మిగ్రేషన్ న్యాయవాదుల సలహాతో కేసులో సాంకేతిక లోపాలు ఏవైనా ఉన్నాయేమో సరిచూసుకోవడం అవసరం.ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతూ చట్టబద్ధంగా దరఖాస్తు చేసుకున్న వలసదారులు ఇలాంటి అనిశ్చితిని ఎదుర్కోవడం దురదృష్టకరం. 19 నెలల నిరీక్షణ అనేది కేవలం సమయానికి సంబంధించింది కాదు.. అది ఒక వ్యక్తి భవిష్యత్తు , మానసిక ప్రశాంతతకు సంబంధించింది. ఇప్పటికైనా యూఎస్.సీఐఎస్ తన ప్రాసెసింగ్ సమయాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## బొగ్గుల శ్రీనివాస్ మృతి మిస్టరీ ఛేదించిన పోలీసులు.. అసలు కారణం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, పాలేరు జలాశయంలోకి ఈనెల 14న కారు దూసుకెళ్లిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదొక సామాన్య రోడ్డు ప్రమాదమని అంతా భావించిన తరుణంలో, మత్స్యకారులు గుర్తించిన చిన్న చిన్న ఆధారాలు ఒక భయంకరమైన హత్యోదంతాన్ని బయటపెట్టాయి. కారు వెనుక సీటులో విగతజీవిగా ఉన్న రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతదేహం కేవలం ఒక ప్రమాద బాధితుడిది కాదు.. అది నమ్మిన స్నేహితుడే వెన్నుపోటు పొడిచిన కుట్రకు సాక్ష్యం. ఖమ్మం గ్రామీణ ఏసీపీ తిరుపతిరెడ్డి వెల్లడించిన వివరాలు, సమాజంలో ఆర్థిక లావాదేవీలు ప్రాణాల కంటే విలువైనవిగా మారుతున్న తీరును ఎత్తిచూపుతున్నాయి.

**ఆర్థిక విభేదాలే..**

బొగ్గుల శ్రీనివాస్, అతని స్నేహితుడు వేణు మాధవరెడ్డి మధ్య ఉన్న ఆర్థికపరమైన విభేదాలే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు నిర్ధారించారు. అప్పుల గొడవలు లేదంటే వ్యాపార లావాదేవీల వల్ల తలెత్తిన మనస్పర్థలు చివరికి ఒకరి ప్రాణాలను తీసే స్థాయికి చేరుకున్నాయి. 'ధనం మూలం ఇదం జగత్' అన్న సూక్తి నేడు 'ధనం మూలం ఇదం హత్య' అన్నట్లుగా మారిపోయింది. తను ఆర్థికంగా ఎదిగేందుకు అడ్డుగా ఉన్నాడనే నెపంతో, ఏళ్ల తరబడి ఉన్న స్నేహాన్ని కాలరాసి, కిరాయి హంతకులను ఆశ్రయించడం వేణు మాధవరెడ్డిలోని నేర ప్రవృత్తికి నిదర్శనం.

**పథకం ప్రకారం..**

హత్యను సహజ మరణంగా లేదా ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితులు పకడ్బందీగా కుట్ర పన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులతో (పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, ఎండీ అజ్మత్ అలీ ఖాన్) ఒప్పందం కుదుర్చుకున్న వేణు, విజయవాడ వెళ్తున్నామని నమ్మించి శ్రీనివాస్‌ను కారులో ఎక్కించుకున్నాడు. నార్కెట్‌పల్లి సమీపంలో పథకం ప్రకారం శ్రీనివాస్‌ను హత్య చేసి, అనంతరం ఆ మృతదేహాన్ని నేరం బయటపడకుండా పాలేరు జలాశయంలోకి కారుతో సహా తోసేయడం సినిమా కథను తలపిస్తోంది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నం, నేరగాళ్లు ఎంతటి తెలివితేటలను ఉపయోగిస్తున్నారో చెబుతోంది.

**మత్స్యకారుల అప్రమత్తత**

ఈ కేసులో మత్స్యకారుల పాత్ర అత్యంత కీలకంగా మారింది. కారు నీటిలోకి దూసుకెళ్లిన సమయంలో ఒక వ్యక్తి బయటకు దూకి తప్పించుకోవడం వారు గమనించడం వల్లే పోలీసులకు అనుమానం కలిగింది. శ్రీనివాస్ సోదరుడు అబ్బులయ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు లోతుగా విచారణ జరిపారు. కూసుమంచి సీఐ, ఎస్ఐ బృందం తక్కువ సమయంలోనే కాల్ డేటా, స్థానిక సాక్ష్యాల ఆధారంగా నిందితులను పట్టుకోవడం అభినందనీయం. కారు ప్రమాదంగా మూసివేయాల్సిన ఫైలును, హత్య కేసుగా మార్చి నిజాలను వెలికితీయడం పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతోంది.

**మానవ సంబంధాల పతనం**

ఒకప్పుడు స్నేహం అంటే ప్రాణమిచ్చే బంధం. కానీ నేడు అదే స్నేహితుడు ప్రాణాలు తీసే యమధర్మరాజుగా మారుతున్నాడు. డబ్బు కోసం సొంత మనుషులను, స్నేహితులను చంపేందుకు వెనుకాడడం లేదంటే సమాజంలో నైతిక విలువలు ఎంత పతనమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. యూ ట్యూబర్‌గా, రచయితగా సమాజానికి తన గళం వినిపించిన శ్రీనివాస్ ఇలా అంతం కావడం సాహిత్య, డిజిటల్ రంగాలకు తీరని లోటు. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత లేకపోవడం, మితిమీరిన ఆశలు ఇలాంటి అనర్థాలకు దారితీస్తున్నాయి. శ్రీనివాస్ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినప్పటికీ, వారికి చట్టం ద్వారా అత్యంత కఠినమైన శిక్షలు పడేలా చూడాలి. అప్పుడే ఇలాంటి నేరాలకు పాల్పడాలనుకునే వారికి భయం కలుగుతుంది. ఆర్థిక గొడవలను చర్చల ద్వారా లేదా చట్టపరంగా పరిష్కరించుకోవాలి తప్ప, ప్రాణాలు తీయడం పరిష్కారం కాదు. సమాజంలో పెరుగుతున్న ఈ నేర సంస్కృతిని అరికట్టడానికి పోలీసు నిఘాతో పాటు, వ్యక్తిగత నైతికత కూడా అవసరం. బొగ్గుల శ్రీనివాస్ ఆత్మకు శాంతి కలగాలని, నిందితులకు తగిన శాస్తి జరగాలని కోరుకుందాం.

## కూర విషయంలో గొడవ.. తల్లిని చంపిన కొడుకు.. దారుణ ఘటన..

**హైదరాబాద్ పెన్ పవర్:** అమ్మ.. ఈ రెండక్షరాల పదంలోనే ప్రపంచమంత ప్రేమ దాగి ఉంటుంది. ఏ చిన్న కష్టం వచ్చినా ఆ గుండెను అక్కున చేర్చుకునే ఆత్మీయత తల్లిది. కానీ, కళ్ల ముందే తిరుగుతున్న కొడుకును చూసి మురిసిపోయిన ఆ తల్లి, తను ప్రేమతో వండిన కూరే తన పాలిట మృత్యుపాశం అవుతుందని ఊహించలేకపోయింది. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా, డోంగర్గావ్ గ్రామంలో జరిగిన ఈ ఘోర కలి కాలపు వికృత చేష్టకు నిలువుటద్దం. కేవలం ఇంట్లో కాకరకాయ కూర వండినందుకే కన్నతల్లిని కడతేర్చిన ఆ కిరాతకుడి చర్య, సభ్య సమాజం తలదించుకునేలా చేస్తోంది.

**మద్యం రక్కసి.. ఛిద్రమవుతున్న సంసారాలు**

ఈ ఘోరానికి ప్రధాన కారణం మద్యం. నిందితుడు జగదీష్ పెట్కులే మద్యానికి బానిస కావడంతో ఇప్పటికే అతని సంసారం చిన్నాభిన్నంగా మారింది. తాగుడు వల్ల కలిగే వేధింపులు భరించలేక అతని భార్య అతన్ని వదిలి వెళ్లిపోయింది. భార్య వెళ్లినా, కొడుకు బాగుపడతాడని ఆశపడిన ఆ వృద్ధురాలు అతనికి తిండిపెడుతూ తనే చూసుకుంటుంది. కానీ మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన కొడుకు.. తనకు నీడనిచ్చిన తల్లిని కూడా మనిషిగా గుర్తించలేకపోయాడు. మద్యం అనేది కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు.. అతని చుట్టూ ఉన్న కుటుంబాలనే సర్వనాశనం చేస్తుందని ఈ ఘటన నిరూపించింది.

**విచక్షణారహిత దాడి**

ఘటన జరిగిన రాత్రి జగదీష్ మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. ఇంట్లో చేసిన కాకరకాయ కూరను చూసి ఆగ్రహానికి లోనయ్యాడు. ఒక సామాన్యమైన కూర విషయంపై తల్లితో గొడవకు దిగడం, అది హత్య వరకు దారితీయడం అత్యంత విచారకరం. సహనం కోల్పోయి తల్లిపై విచక్షణారహితంగా దాడి చేసి చంపేశాడు. ఇక్కడ సమస్య కేవలం కూర మాత్రమే కాదు, మద్యం వల్ల ఆ వ్యక్తి మెదడులో కలిగిన అస్థిరత. చిన్న చిన్న కారణాలకే ప్రాణాలు తీసే స్థాయికి మనిషి వెళ్తున్నాడంటే, సమాజంలో హింస ఎంతగా వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు.

**నేర ప్రవృత్తి.. సామాజిక విశ్లేషణ**

హత్య చేసిన అనంతరం జగదీష్ గ్రామంలో తిరుగుతూ 'నేను మా అమ్మను చంపాను' అంటూ గట్టిగా కేకలు వేయడం అతనిలోని నేర ప్రవృత్తికి మత్తులో ఉన్న అపస్మారక స్థితికి నిదర్శనం. ఒక ఘోరమైన తప్పు చేశాననే పశ్చాత్తాపం కంటే, మద్యం మత్తులో ఆ విషయాన్ని ప్రకటించడం అతని వికృత మనస్తత్వాన్ని చూపిస్తోంది. గ్రామస్తులు సకాలంలో స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

**మద్య నిషేధం అవసరమా?**

ఇలాంటి ఘటనలు ఏదో ఒక మారుమూల గ్రామంలో జరిగే చిన్న గొడవలు కావు. ఇవి దేశవ్యాప్తంగా ఉన్న మద్యపాన సమస్యకు సూచికలు. మద్యం ద్వారా వచ్చే ఆదాయం కంటే, దానివల్ల విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు, జరుగుతున్న నేరాల వల్ల కలిగే నష్టం దేశానికి ఎంతో ఎక్కువ. మద్యానికి బానిసలైన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, గ్రామ స్థాయిల్లో మద్యం విక్రయాలపై నియంత్రణ విధించడం అత్యవసరం. కేవలం ప్రభుత్వాలే కాకుండా, సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా మెలగాలి.

# రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి





**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 22**

పట్టణ సమీపంలోని గోపాలపురం జాతీయ రహదారి 565 వద్ద టెంపో ట్రాక్టర్ ఢీకొని మహిళా మృతి. వివరాలు కర్ణాటక రాష్ట్రంలోని విజయనగర జిల్లా కొట్టూరు మండలం, నగరకట్టు గ్రామానికి చెందిన మహంతప్ప తన కుటుంబ సభ్యులు కూతురు, అల్లుడు బంధువులు మరియు గ్రామస్తులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలు దర్శన నిమిత్తం, కే ఏ.01ఏసి4113 నెంబర్ గల టెంపో ట్రావెలర్ వాహనంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వారి నగరకట్టు గ్రామం నుండి బయలుదేరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు వచ్చి మంత్రాలయం, మహానంది, శ్రీశైలం దేవాలయాలు సందర్శించుకుని అక్కడి నుండి తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకొను నిమిత్తం శ్రీశైలం నుండి శనివారం రాత్రి 8 గంటల సమయంలో బయలుదేరి వెళుతూ ఉండగా మార్గమధ్యంలో ఆదివారం ఉదయం 05.30 గంటలకు మార్కాపురం జిల్లా, పామూరు పట్టణ సమీపంలోని గోపాలపురం జాతీయ రహదారి 565 వద్దకు వచ్చేసరికి, టెంపో డ్రైవర్ పూజారి మని ఆర్. నవీన్ టెంపోను నడుపుతూ వచ్చి ముందు వెళ్తున్న ట్రాక్టర్ను ఢీకొట్టడంతో టెంపో లో ఉన్న కొందరు ప్రయానులకు దెబ్బలు తగిలాయి. విశాలక్ష్మి అను ఆమెకు ముక్కు భాగంలో మూతి వద్ద బలమైన రక్త గాయముల అవ్వగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అప్పటికే మరణించిందని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. మిగిలిన క్షతగాత్రులను మెరుగైన చికిత్స అందించి సి. హెచ్.సి పామూరు నుండి కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కొమరోలు లోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టల్‌లను

# తనిఖీ చేసిన తాసిల్దార్ భాగ్యలక్ష్మి

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం సౌకర్యవంతమైన వసతి కల్పించాలని ఆదేశం.**

**విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.**

**అనుమతి లేకుండా విద్యార్థులను బయటికి పంపరాదు.**

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 22**

కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి కొమరోలు లోని ఎస్సీ ,బీసీ బాలుర హాస్టల్ లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు .కొమరోలు పట్టణంలోని ఎస్ బి ఎన్ ఆర్ ఎం పాఠశాల సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ను తాసిల్దార్ భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పెద్దదేవ నాయక్ ఆకస్మికంగా సందర్శించారు .ఆ సందర్భంగా విద్యార్థుల కొరకు తయారు చేస్తున్న ఆహారాన్ని పరిశీలించి వంట నిర్వాహకులకు తగు సూచన సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు అందుతున్న భోజనం ,వసతి సౌకర్యాలు, చదువుకొనుటకు కల్పిస్తున్న సౌకర్యాలు తదితర వాటిని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆమె హాస్టల్లో ఉండవలసిన విద్యార్థుల సంఖ్యను, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు .అనంతరం ఆ హాస్టల్ వార్డెన్ రామచంద్రారెడ్డి తో మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ,విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరచాలని ఆమె కోరారు .10వ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. అనంతరం గోపానిపల్లెలోని ఏబీఎన్ హై





స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వెనుకబడిన తరగతుల బాలుర హాస్టల్ను తాసిల్దార్ భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పెద్దదేవ నాయక్ సందర్శించి పరిశీలించారు. ఉదయం సేకరించిన ఎఫ్ ఆర్ ఎస్ లో 40 మంది విద్యార్థులు హాజరైనట్లుగా నమోదు చేసి ఉండగా సాయంత్రం తాసిల్దార్ సందర్శన సమయానికి 15మంది విద్యార్థులు కనిపించారు. దీనితో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ, హాస్టల్లో అందుతున్న భోజనం, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు .వంట నిర్వాహకులకు తమ సూచనలు సలహాలు ఇచ్చారు. వార్డెన్ కొండయ్యతో మాట్లాడుతూ హాస్టల్ లో విద్యార్థుల హాజరు సంఖ్యను మెరుగుపరచాలని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ,చదువుకొనుటకు, నిద్రించుటకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, దోమల బెడద లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, హాస్టల్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, క్రిములు కీటకాలు ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. అనుమతి లేకుండా విద్యార్థులను బయటికి పంపించవద్దని, తల్లిదండ్రుల అనుమతితో మాత్రమే విద్యార్థులను ఇళ్లకు పంపాలని ఆమె సూచించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు తాసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రంగనాయకులు ,హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధోని రిటైర్మెంట్ ఊహాగానాలకు బ్రేక్..
# సీఎస్కే సీఈఓ బిగ్ అప్‌డేట్





**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ చేస్తారనే ఊహాగానాలకు బ్రేక్ పడింది. మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమైతున్నట్లు తెలుస్తుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో కూడా ధోనీ ఆడబోతున్నారని చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) సీఈఓ కాశీ విశ్వనాథన్ ధృవీకరించారు. కాగా ధోనీ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు సార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకుంది. ఐపీఎల్ కెరీర్‌లో అతడు మొత్తం 235 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించగా, 136 విజయాలు సాధించారు. ధోని కెప్టెన్సీ విజయం శాతం 57.87గా ఉంది. ఐపీఎల్ ఆరంభం నుంచే చెన్నై సూపర్ కింగ్స్‌తో ఉన్న ధోనీ, ఫ్రాంచైజీకి ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్‌గా చరిత్ర సృష్టించారు. ఈ ఐదు ట్రోఫీలు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికం కావడం విశేషం. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు ధోనీ కెప్టెన్సీ బాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించినప్పటికీ, ఆటగాడిగా మాత్రం జట్టుతోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు 2026 సీజన్‌లోనూ అతని అనుభవం సీఎస్కేకు కీలకంగా మారనుంది. అబుదాబిలో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో సీఎస్కే మొత్తం 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026కు ముందు సీఎస్కే కీలక మార్పులు చేసింది. సంజూ శాంసన్‌ను రూ.18 కోట్ల జట్టులోకి తీసుకుంది. అదే సమయంలో రవీంద్ర జడేజా (రూ.14 కోట్లు), సామ్ కరన్ (రూ.2.4 కోట్లు) ట్రేడ్ ద్వారా రాజస్థాన్ రాయల్స్‌కు వెళ్లారు. రాహుల్ చాహర్, అకీల్ హోసైన్, మ్యాట్ హెన్రీ, మ్యాథ్యూ షార్ట్,
సర్ఫరాజ్ ఖాన్ లాంటి అనుభవజ్ఞులతో పాటు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు కార్తిక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లపై ఒక్కొక్కరికి రూ.14.2 కోట్లతో కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 26వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. పూర్తి షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు. ధోనీ మరోసారి మైదానంలోకి దిగనుండటంతో, సీఎస్కే అభిమానుల్లో ఉత్సాహం మరోసారి పిక్స్‌కు చేరింది.

# దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్... టీమిండియా ముందు భారీ టార్గెట్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ సూపర్ 8 పోరులో దక్షిణాఫ్రికా జట్టు, టీమిండియా ముందు 188 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. డేవిడ్ మిల్లర్ (63), డెవాల్డ్ బ్రెవిస్ (45), ట్రిస్టన్ స్టబ్స్ (44లి) మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో సఫారీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా (3/15) అద్భుత ప్రదర్శన చేసినా, ఇతర బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ధాటికి 20 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్వింటన్ డి కాక్ (6), కెప్టెన్ మార్‌క్రమ్ (4), ర్యాన్ రికెల్టన్ (7) విఫలమయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. బ్రెవిస్ ఔటైన తర్వాత మిల్లర్, స్టబ్స్ మరింత దూకుడుగా ఆడారు. ముఖ్యంగా మిల్లర్ కేవలం 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 63 పరుగులు చేయగా, చివర్లో స్టబ్స్ 24 బంతుల్లోనే 44 పరుగులు చేసి స్కోరును 180 దాటించాడు. భారత బౌలర్లలో బుమ్రా 4 ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లు తీశాడు. అయితే, హార్దిక్ పాండ్యా (45), వరుణ్ చక్రవర్తి (47) ధారాళంగా పరుగులు ఇవ్వడం దక్షిణాఫ్రికాకు కలిసొచ్చింది.

# పేకమేడలా కూలిపోయిన లంక లైనప్... ఇంగ్లండ్ అద్భుత విజయం






**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ సూపర్-8 పోరులో ఇంగ్లండ్ జట్టు శ్రీలంకపై 51 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. పల్లెకెలె వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో శ్రీలంక పూర్తిగా విఫలమైంది. ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 16.4 ఓవర్లలో కేవలం 95 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై లంకేయులకు ఇది దిగ్భ్రాంతి కలిగించే పరాజయం. 147 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్లు పతుమ్ నిస్సంక (9), కమిల్ మిషార (6) త్వరగా వెనుదిరిగారు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కుశాల్ మెండిస్ (4), పవన్ రత్నాయకే (0), దునిత్ వెల్లలాగే (10) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. కేవలం 34 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ దసున్ షనక (30 పరుగులు, 24 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసినా, అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం కరువైంది. కమిందు మెండిస్ (13) కాసేపు నిలిచినా ఫలితం లేకపోయింది. ఇంగ్లండ్ బౌలర్ల క్రమశిక్షణాయుత బౌలింగ్‌కు లంక బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. స్పిన్నర్ విల్ జాక్స్ కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో లంక పతనాన్ని శాసించగా, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ జోస్ బట్లర్ (7) విఫలమయ్యాడు. అయితే, ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (62 పరుగులు, 40 బంతుల్లో, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, సాల్ట్ దూకుడుగా ఆడి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. హ్యారీ బ్రూక్ (14), విల్ జాక్స్ (21) చివర్లో వేగంగా ఆడటంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లలో యువ స్పిన్నర్ దునిత్ వెల్లలాగే 26 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మహీశ్ తీక్షణ, దిల్షాన్ మధుశంక చెరో రెండు వికెట్లతో రాణించారు.

# మొత్తానికి ఫేవరెట్ స్టార్ తో జాన్వీకపూర్!

ఎంత పెద్ద హీరోయిన్ అయినా అభిమాన హీరో అంటూ ఒకరుంటారు. నటిగా కెరీర్ ముగిసే లోపు ఒక్క సారైనా ఆ స్టార్ సరసన నటించాలని కోరుకుంటారు. కానీ అలా అందరి హీరోయిన్ల విషయంలో జరగదు. ఎంత ట్యాలెంట్ ఉన్నా? అదృష్టం కూడా కలిసొస్తేనే ఛాన్స్ అందుకోగలరు. పవన్ కళ్యాణ్ సరసన అనుష్క నటించాలని ఎంతో కాలంగా అనుకుంటోంది. కానీ ఆ కాంబినేషన్ ఇంత వరకూ సెట్ కాలేదు. ఏ దర్శకుడు కూడా వాళ్లిద్దర్నీ కలిపే ప్రయత్నం కూడా చేయలేదు. అలాగని పవన్ ఇమేజ్ కు సరితూగని హీరోయిన్ అంటే? అదీ కాదు అనుష్కను అభిమానించే తెలుగు వారు ఎంతో మంది ఉన్నారు. మరెందుకు నటించలేదంటే కాలం కలిసి రాకనే చెప్పాలి. ఆ సంగతి పక్కన బెడితే? జాన్వీ కపూర్ అభిమాన స్టార్ ఎవరు? అంటే రణబీర్ కపూర్ అని అందిరికీ తెలుసు. మరి అతడితో జాన్వీ సినిమా చేసిందా? అంటే ఇంత వరకూ సాధ్యపడలేదు. చాలా కాలంగా రణబీర్ కపూర్ సరసన నటించాలని జాన్వీ భావిస్తోంది. ఓపెన్ గానే ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పింది. కానీ బాలీవుడ్ మేకర్స్ ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా ఆమె ఆసక్తిని మోహిత్ సూరి గమనించాడో? ఏమోగానీ ఆ ఛాన్స్ తానే ఇస్తానంటూ ముందుకొచ్చాడు.

రణబీర్ కపూర్ హీరోగా ఓ గ్యాంగ్ స్టార్ మ్యూజికల్ లవ్ స్టోరీని తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. వాస్తవానికి మోహిత్ సూరి కూడా చాలా కాలంగా రణబీర్ తో సినిమా



చేయాలనుకుంటున్నాడు. కానీ రణబీర్ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండటంతో సాధ్యపడలేదు. ఇంతకాలానికి ఆ కాంబినేషన్ సెట్ అయింది. ఇందులో హీరోయిన్ గా ఎవర్ని తీసుకోవాలి? అనే చర్చ మోహిత్ టీమ్ లో జరగగా..ఆయన మరో ఆలోచన లేకుండా జాన్వీ కపూర్ ను ఫిక్స్ చేసారట. జాన్వీ కపూర్ ఆసక్తిని గమనించే మోహిత్ ఈ ఛాన్స్ కల్పించినట్లు వెలుగులోకి వస్తోంది.

తాను ఎవరో నటిని తీసుకోవడం కంటే? అభిమాన హీరోకి జోడీగా తననే తీసుకుంటే? కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుంది. చాలా సన్నివేశాల విషయంలో రాజీ పడాల్సిన పని ఉండదు. పైగా మోహిత్ సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో ఘాడత కూడా ఎక్కువగానే ఉంటుంది. హీరోతో ఇంటిమేట్ సన్నివేశాలకు సైతం నో చెప్పడానికి ఛాన్స్ ఉండదు. సెట్స్ కు వెళ్లిన తర్వాత ఏ నటి అయినా దర్శకుల హీరోయిన్ గా పనిచేయాల్సిందే. అందుకు జాన్వీ కపూర్ ఎప్పుడూ సిద్దంగానే ఉంటుంది. ప్రస్తుతం అమ్మడు తెలుగులో 'పెద్ది' లో రామ్ చరణ్ కు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో మాత్రం మోహిత్ సూరి ప్రాజక్ట్ తప్ప ఇంకే సినిమాకు కమిట్ అవ్వలేదు. మోహిత్ సూరి పిలిచి ఇస్తోన్న అవకాశం కాబట్టి జాన్వీ ఆనందంతో ఉబ్బితబ్బితోంది.



లేత-రంగు చీరలో ప్రియా భవాని శంకర్ స్టన్స్



ఐశ్వర్య మీనన్ యొక్క బ్రీజీ సీసైడ్ అవుట్‌ఫిట్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com